
దోమలను తరిమేద్దాం



- **చిన్నచిన్న జాగ్రత్తలతో మశకాల పని పట్టొచ్చు..**
- **వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు అవగాహనే అసలు మందు**
- **కోటవీధి, చాకలిపేట, అల్లిపురం, దిబ్బలపాలెం, జ్ఞానాపురం తదితర మురికివాడల్లో పట్టి పీడిస్తున్న దోమలు**

దాబాగార్డెన్స్ : మహానగరం దోమలకు నిలయంగా మారిపోయింది. లోతట్టు ప్రాంతాలు..కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు అనే తేడా లేకుండా దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఈ మశకాల వల్ల డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాపించడంతో విశాఖ విలవిల్లాడిపోతోంది. ఎవరికి వారు పరిసరాల పరిశుభ్రతతో పాటు చిన్ని చిన్న చిట్కాలు పాటించడం ద్వారా దోమలు తరిమేయవచ్చనంటున్నారు నిపుణులు.

దోమలకు ఆవాసాలివే..

ప్రధానంగా దోమలు నీటిగుంటలు, గడ్డి ఎక్కువగా ఉండే ప్రాంతాలు, కాలువలు, వంతెనల కింద నిల్వ ఉండే నీటి పరిసరాలను తమ స్థావరాలుగా ఎంచుకుంటాయి. ఇలాంటి ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రధాన దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. నగరంలో ఫాగింగ్ చేస్తున్నా..ఆ రసాయనాలకు సైతం దోమలు నాశనం కావడం లేదంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా నియోజకవర్గ పరిధి వెలంపేట, పెయిందొరపేట, చాకలిపేట, ప్రసాద్ గార్డెన్స్, ఏడుగుళ్లు, అల్లిపురం, కొబ్బరితోట, జాలారిపేట, జబ్బరతోట, కోటవీధి, ఫెర్రీరోడ్డు, గొల్లలపాలెం, దిబ్బలపాలెం, రామజోగిపేట, రెల్లివీధి, కోడిపందాలవీధి, జ్ఞానాపురం తదితర మురికివాడల్లో ఈ సమస్య అధికంగా ఉంది. మురుగు కాలువలు అధికంగా ఉన్న ప్రదేశాల్లో దోమల బెడద అధికంగా ఉంది. అందుకే ఎవరికి వారు వాటిని అదుపు చేయాలి.

వ్యర్థాలతో దోమల స్వైరవిహారం

కాఫీ డికాక్షన్‌తో..

ఇంటి సమీపంలో నీరు నిలిచిన చోట దోమలు గుడ్లు పెడతాయి. కాఫీ డికాక్షన్ చల్లడం ద్వారా ఆ నీటిలోని దోమల గుడ్లు నీటిపైకి చేరతాయి. అవి ఆక్సిజన్‌కు లోను కావడం వల్ల దోమలుగా మారకుండానే నిర్వీర్యమైపోతాయి. ఆ నీటిలో దోమలు గుడ్లు కూడా పెట్టవు.



ఐస్‌తో నైస్..

దోమలు మనం విడిచిపెట్టే కార్బన్ డయాక్సైడ్‌కు ఆకర్షితమవుతాయట. అందుకని వాటిని మరో రూపంలో వలవేసి పట్టాలంటున్నారు నిపుణులు. ఐస్ గడ్డలు కూడా కార్బన్‌డైయాక్సైడ్‌ను విడుదల చేస్తాయి. అందుకే ఐస్ గడ్డలను ఓ బాక్స్‌లో ఉంచి ఇంట్లో అక్కడక్కడ ఉంచాలి. దోమలు వీటి దగ్గరకు చేరతాయి. అప్పుడు దోమల ఎలక్ట్రికల్ బ్యాట్‌ను తీసుకుని వాటి భరతం పట్టాలి.

పిచ్చి మొక్కలకు బదులు

పిచ్చి మొక్కలు ఎక్కువ ఉంటే దోమల సంతాన ఉత్పత్తి కేంద్రాలుగా మారుతాయి. చాలా మంది అందం కోసం అనేక మొక్కలు పెంచుతారు. వాటికి బదులు ఇళ్లల్లో తులసి, పుదీనా, సిట్రోనెల్లా, లెమన్ గ్రాస్ వంటి మొక్కలను కుండీల్లో పెంచుకోవడం వల్ల దోమలు చాలా వరకూ కంట్రోల్ అవుతాయి.



కర్పూరం.. చాలా మేలు.

దాదాపు ప్రతి ఇంట్లోనూ కర్పూరం ఉంటుంది. ఇది దోమల సంహారానికి చక్కగా పనిచేస్తుంది. చీకటి పడుతున్న సమయంలో ఇంటి తలుపులన్నీ మూసేసి పెద్ద కర్పూరం వెలిగించండి. 20 నిమిషాల తర్వాత ఒక్క దోమ కూడా కనిపించదు. ఎక్కువ సమయం పాటు కీటక నివారిణిగా కర్పూరం పనిచేస్తుంది. లేదా చిన్న పాత్ర తీసుకుని అందులో నీరు పోసి ఒకటి లేదా రెండు కర్పూరం బిళ్లల్ని విరిచి అందులో వేసి గదిలో పెడితే మంచి ఫలితం ఉంటుంది.

దోమల బెడద



రాత్రయితే చాలు దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమల నివారణకు ఆలౌట్..పెట్టుకుంటున్నాం. దీంతో పిల్లలు శ్వాసతో ఇబ్బందులు పడుతున్నారు. దోమల నియంత్రణకు జీవీఎంసీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

–జి.రమాదేవి, మహారాణిపేట

ఈ సూచనలు పాటిస్తే మేలు

- ముఖ్యంగా సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమం తర్వాత ఇంటి తలుపులు తెరవరాదు. ఆ సమయంలో దోమలు ఎక్కువగా చురుగ్గా ఉంటాయి. అప్పుడే ఎక్కువ శాతం దోమలు ఇంట్లోకి చొరబడతాయి.
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ఇంటి లోపల, ఇంటి పైన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు మూతలు బిగించి ఉంచాలి.
- ఆరోమా ఆయిల్స్ మార్కెట్లో లభిస్తాయి. వీటిలో సిట్రోనెల్లా, నిమ్మగడి నూనె..ఇలా ఎన్నో రకాలు ఉంటాయి. వీటిని ఆయిల్ బర్నర్‌లో వేయడం ద్వారానూ ఇంటి నుంచి దోమలు పరారవుతాయి.
- దోమలు లైటింగ్‌కు కూడా ఆకర్షితమవుతాయి. అందుకే ఎల్లో షేడ్ ఉండే ఎల్ఈడీ లైట్లను ఇంట్లో వాడడం వల్ల దోమలు అంతగా ఆకర్షతం కావని నిపుణులు చెబుతున్నారు. దోమల నివారణకు ఉపకరించే సోడియం ల్యాంప్స్ కూడా వాడుకోదగినవే.



దోమల స్థావరాలు..గుడ్లు పెట్టే ప్రాంతాలు

వెల్లుల్లి..భలే నివారిణి..

దోమల నివారణకు ఉన్న సహజ సిద్ధ మార్గాల్లో వెల్లుల్లి కూడా ఒకటి. వెల్లుల్లి వెదజల్లే ఘాటు వాసన దోమలకు పడదు. అందుకే అవి దూరంగా వెళ్లిపోతాయి. వెల్లుల్లి రెబ్బలను మధ్యకు కట్ చేసి ఇంటి ద్వారాలు, కిటికీల వద్ద ప్లేట్లలో ఉంచితే మంచి ఫలితం ఉంటుంది. అంతే కాకుండా కొన్ని వెల్లుల్లి రెబ్బలను చిదిమి నీళ్లల్లో వేసి కాచి ఆ నీటిని ఇంట్లో స్ప్రే చేసినా దోమలు ఉండవని నిపుణులు చెబుతున్నారు. ఆ నీటిని చర్మంపై చల్లుకున్నా దోమలు కుట్టే సాహసం చేయవు.




ఫాగింగ్ ఎక్కడ?



దోమల నియంత్రణకు జీవీఎంసీ చేపట్టే చర్యలు ఏమీ కనిపించడం లేదు. ఫాగింగ్ చేసే వారిని ఎప్పుడో చూశాం. ఐదారు నెలలు కావస్తోంది. మా ప్రాంతంలో అసలు ఫాగింగే చేయడం లేదు. దోమలు విజృంభిస్తున్నాయి.

–ఆర్.గంగాభవాని, దిబ్బలపాలెం



విష జ్వరాలు ప్రబలుతున్నా..



దోమలు కారణంగా జ్వరాలు ప్రబలుతున్నా..జీవీఎంసీ నియంత్రించే చర్యలు చేపట్టడం లేదు. మలేరియా సిబ్బంది ఇంటింటికి వస్తున్నారు. ఇంటి ముందు ఉన్న గోడపై సంతకం పెట్టి వెళ్లిపోతున్నారు. వార్డు కార్పొరేటర్ పట్టించుకోరు. జీవీఎంసీ అధికారులు పర్యవేక్షించరు. కంటి మీద కునుకు ఉండడం లేదు.

–వసగాడ రామలింగేశ్వరరావు, జగదాంబ ఏరియా

వసతిగృహంలో ఇద్దరికి ఆశ్రయం



సులారాం మజహిని షెల్టర్ హోంకు అప్పగిస్తున్న రైల్వే పోలీసు కానిస్టేబుల్ సింహాచలం



ఏయూటీడీ షెల్టర్‌లో అప్పలరాజు

సీతమ్మధార: జీవీఎంసీ నిరాశ్రయ వసతిగృహంలో సోమవారం ఇద్దరికి ఆశ్రయం కల్పించారు. ఒడిశా రాష్ట్రం రాయగడకు చెందిన సులారం మజహి(55) కొద్దికాలంగా రోడ్డు మీద కాగితాలు, బాటిల్స్ ఏరుకుంటూ దుర్భర జీవితం సాగిస్తున్నాడు. ఒంటరి జీవితం గడుపుతూ రైల్వేస్టేషన్‌లో ఉంటున్న అతని దీనస్థితికి చలించిన రైల్వే పోలీసు కానిస్టేబుల్ సింహాచలం ఏయూటీడీ జీవీఎంసీ షెల్టర్ హోమ్‌కు అప్పగించారు. ఈ రెస్క్యూలో ఏయూటీడీ కేర్‌టేకర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజయనగరంవాసి అప్పలరాజుకు ..

ఉపాధి కోసం వలస వచ్చిన విజయనగరం జిల్లా, ఎస్.కోట, మొక్కలపాడు గ్రామానికి చెందిన అప్పలరాజుకు జీవీఎంసీ టీఎస్సార్ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. వైజాగ్‌లో కేటరింగ్ వర్క్ చేస్తున్న అప్పలరాజుకు బాక్స్ మూత తగిలి చేతికి గాయమైంది. దీంతో ఏయూటీడీ ద్వారా వైద్య సహాయం అందిస్తున్నారు. గాయం నయమయ్యే వరకు చికిత్స పొంది, ఊరుకు వెళ్లిపోతానని అప్పలరాజు చెప్పాడు. సిబ్బంది తాత్కాలికంగా ఆశ్రయం కల్పించారు.

ఘనంగా నీలమాంబేశ్వరి తొలేళ్ల మహోత్సవం

అల్లిపురం: అచ్చియ్యమ్మపేట, యాతపేటరోడ్డులో వెలసిన నీలమాంభేశ్వరి అమ్మవారి వార్షిక పరస మహోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ అధ్యక్షుడు రీసు చంద్రరావు ఆధ్వర్యంలో అమ్మవారికి తెల్లవారు జాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతితో పాటు రమణమ్మ, చంద్రయ్య, చలపతి, అప్పారావు, అనిల్ తదితరులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం కెప్టెన్ రామారావు జంక్షన్ అమ్మవారి సదనం పట్టు వద్ద నుంచి అచ్చియ్యమ్మపేట, జెండాచెట్టు మీదుగా యాతపేటలో వెలసిన నీలమాంభేశ్వరి అమ్మవారి దేవాలయం వరకు డప్పు వాయిద్యాల మధ్య పసుపు, వేపకొమ్మలతో కూడిన కళశాలతో తిరువీధి ఉత్సవం కొనసాగింది. అనంతరం అమ్మవారికి వాటితో జలాభిషేకం చేపట్టారు. ఈ సందర్భంగా తోట పద్మావతితో పాటు రమణమ్మను ఘనంగా సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



అమ్మవారి జలాభిషేకానికి కెప్టెన్ రామారావు జంక్షన్ నుంచి వెళ్తున్న తోట పద్మావతి, రమణమ్మ

నేడు ప్రధాన పండగ

అమ్మవారి ప్రధాన పండగ మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు రీసు చంద్రరావు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. సాయంత్రం పరస మహోత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలన్నారు.

23న రక్తదాన శిబిరం

దాబాగార్డెన్స్: విశాఖ జిల్లా బాడీలిఫ్టింగ్ సంఘం కార్యనిర్వహణ కార్యదర్శి కిలాని చిరంజీవి జ్ఞాపకార్థం ఈ నెల 23న స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఆంధ్ర రాష్ట్ర బాడీ లిఫ్టింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి కిలాని గణేష్ పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రామాటాకీస్ సమీపాన గల వాయిపుత్ర హెల్త్‌క్లబ్ ఆవరణలో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. స్వచ్ఛంద రక్తదానం చేయడానికి సేవా దృక్పథంతో ముందుకు రావాలని, ప్రతి ఏడాది రెండుసార్లు హెల్త్‌క్లబ్ ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు 88852 03519 నంబరులో సంప్రదించవచ్చు.

వేమన మందిరానికి సీల్..

- ఎమ్మెల్యే ఒత్తిడి..కలెక్టర్ ఆదేశాలతో నిర్వాహకులకు తాళాలు అప్పగించిన అధికారులు



సీల్ వేస్తున్న జీవీఎంసీ రెవెన్యూ సిబ్బంది

దాబాగార్డెన్స్: వేమన మందిరానికి జీవీఎంసీ అధికారులు సోమవారం ఉదయం సీల్ వేశారు. ఒత్తిడి రావడంతో గంటలోనే సీల్ విప్పారు. వివరాలివి.. ఆశీల్‌మెట్టలోని వేమన మందిరాన్ని లీజుకు తీసుకుని 45 ఏళ్ల అయింది. దీంతో జీవీఎంసీ రెవెన్యూ సిబ్బంది వేమన మందిరంలోని రూమ్‌లకు తాళాలు వేశారు. వెంటనే వేమన సంక్షేమ సంఘం ప్రతినిధులు నగరంలోని ఓ ఎమ్మెల్యే దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఆయన నుంచి అధికారులకు ఫోన్లు వెళ్లాయి. దీంతో కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ అధికారులకు ఫోన్ చేసి తక్షణమే వేమన మందిరాన్ని తెరవాలని ఆదేశించారు. దీంతో జీవీఎంసీ రెవెన్యూ అధికారులు సీల్ వేసిన రూమ్‌లు తెరిచి నిర్వాహకులకు అప్పగించారు.

బేడ జంగాలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

ఎన్నికల ముందు హామీని చంద్రబాబు నెరవేర్చాలి

దాబాగార్డెన్స్: బేడ జంగాలకు ఎస్సీ సర్టిఫికెట్లు మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బేడా బుడ్గ జంగం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వై.మధు డిమాండ్ చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బేడ జంగాలు అన్ని విధాలుగా బాగా వెనకబడి ఉన్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2008 వరకు బేడ జంగాలకు ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేసేవారని చెప్పారు. అదే ఏడాది జూలై నుంచి ఇప్పటి వరకు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు జారీ చేయడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం బేడ జంగాలకు న్యాయం చేయడం లేదన్నారు. ఎన్నికల ముందు మాత్రం వచ్చేది మన ప్రభుత్వమే అంటూ..బేడ జంగాలను వాడుకున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని చంద్రబాబునాయుడు, లోకేష్ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదిక పంపాలని కోరారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ముందు రిలే నిరాహార దీక్షలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో పలువురు సమితి సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సమితి రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మధు

ఆర్డీవోపై చర్యలకు డిమాండ్



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న పలు ప్రజా సంఘాల నాయకులు

మహారాణిపేట: లీడర్ ఎడిటర్ వి.వి.రమణమూర్తికి ఆర్డీవో శ్రీలేఖ నోటీసులు జారీ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సోమవారం దళిత, మహిళ, కార్మిక, వామపక్ష, మానవ, పౌర, ప్రజా, జర్నలిస్ట్ సంఘాల నాయకులు ఆందోళన చేశారు. తక్షణం ఆమెపై విచారించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విదసం ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ భూకుంభకోణంపై వాస్తవాలు రాసిన పత్రికకు ఆర్డీవో శ్రీలేఖ నోటీసులు ఇచ్చారని, వెంటనే ఈ నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకులు ఎం.లక్ష్మీ, ఐఎఫ్టీయూ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మీడియాపై దాడికి పాల్పడుతున్న ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వ్యవహారంపై విచారణ జరిపి, నోటీసులు వెనక్కి తీసుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామమూర్తి, సీఎంఎస్ లలిత, మనభూమి సత్యనారాయణ, న్యాయవాదులు చలం, కె.పద్మ, ఏపీజేయూ, ఏపీడబ్ల్యూజే, కాంగ్రెస్ ప్రతినిధులు, ప్రజా గాయకులు మజ్జి దేవిశ్రీ, భీమ్సేన్ వార్ తదితరులు పాల్గొన్నారు.



శుభకార్యాలకు వీరి చేయి పడాల్సిందే..

శుభ ముహూర్తాలతో నగరం కళకళలాడుతోంది. దీంతో అనేక వర్గాల ప్రజలకు చేతినిండా పని దొరుకుతోంది. మాఘ మాసంలో పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, ఉపనయనాలు వంటి శుభకార్యాలు అధికంగా నిర్వహిస్తారు. ఈ సమయంలో ఇంటిని, కల్యాణ మండపాన్ని అలంకరించడానికి వివిధ వస్తువులు వినియోగిస్తారు. పెళ్లి సమయంలో పెళ్లి కుమార్తెను తీసుకువెళ్లే గౌరీ తపస్సు బుట్ట, కల్యాణ వేదిక, ఇంటిని అలంకరించడానికి కొబ్బరి ఆకులతో తయారు చేసే వస్తువులకు మంచి గిరాకీ ఉంటుంది. పూర్ణా మార్కెట్ సమీపంలోని మేదర వీధి ప్రాంతంలో పదుల సంఖ్యలో కుటుంబాలు నిత్యం ఈ పనులను చేస్తుంటారు. పచ్చిగా ఉండే కొబ్బరి ఆకులను తీసుకువచ్చి విభిన్న డిజైన్లలో అల్లికలు చేసి కల్యాణ వేదికలు, ఇళ్లను అలంకరించడంలో వీరు నిపుణులు. ప్రస్తుతం శుభకార్యాలు, ముహూర్తాలు ఉండటంతో వీరికి చేతినిండా పని దొరుకుతోంది.

–ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా

వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించనున్న సైన్స్ అకాడమీస్ లెక్చర్ వర్క్‌షాప్ పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల సోమవారం ఆవిష్కరించారు. కళాశాల మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌లో పలువురు అధ్యాపకులు పాల్గొంటున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో కార్యక్రమ కో-ఆర్డినేటర్ జ్యోతి, మైక్రో బయాలజీ అధ్యాపకులు, బయోటెక్నాలజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్ల వితరణ



పేదలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ నార్త్ ఈస్ట్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: బీచ్‌రోడ్డులోని బాల వికాస్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రంలో పేద మహిళలకు సోమవారం లయన్స్‌క్లబ్ నార్త్ ఈస్ట్ సభ్యులు రెండు కుట్టు మిషన్లు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు మంచుకొండ సురేష్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా మహిళలకు వీటిని అందజేశామన్నారు. మహిళలు వృత్తి విద్యలో శిక్షణ పొంది, ఆర్థికంగా బలపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎం.వీరభద్రరావు, కార్యదర్శి సతీష్, కోశాధికారి జగన్నాథ గుప్త, వైస్ ప్రెసిడెంట్ ఎం.రంగబాబు, బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు పాల్గొన్నారు.

23న న్యూ డెమోక్రసీ పార్టీల విలీనం



జీవీఎంసీ గాంధీ పార్కులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సీతమ్మధార: విజయవాడలో రెండు న్యూ డెమోక్రసీ పార్టీల రాష్ట్రస్థాయి విలీన సభ ఈ నెల 23న జరగనుందని న్యూ డెమోక్రసీ విశాఖ, విజయనగరం ఏరియా కమిటీ అధికార ప్రతినిధి వై.కొండయ్య తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2013లో చీలికకు గురై రెండు న్యూ డెమోక్రసీ పార్టీలుగా రాష్ట్రంలో కార్యాచరణ సాగిస్తున్న పార్టీలు.. తిరిగి ఏకం కావాలని నిర్ణయించాయని వెల్లడించారు. అందుకు విజయవాడ వేదిక కానుందన్నారు. ఈ సానుకూల పరిణామాన్ని విప్లవ, ప్రజాస్వామిక శక్తులు, అస్తిత్వవాదులు బలపరచాలని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, ఎం.ఎన్.ఎస్.ఎస్ పూర్వ అధ్యక్షుడు కె.రవి, నగర కన్వీనర్ ఈ.లక్ష్మి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు డి.ఏడుకొండలు, ఉపాధ్యక్షుడు కె. బాలనాగమ్మ పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న మల్లికాంబ

దాబాగార్డెన్స్: విశాఖ వెల్డింగ్ అండ్ ఫ్యాబ్రికేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ 2025 డైరీని జీవీఎంసీ ఎఫ్ఏ అండ్ ఏఓ ఆర్ మల్లికాంబ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రఘు, కార్యదర్శి విజయ్, సహాయ కార్యదర్శులు శ్రీనివాసరావు, రాజు, కోశాధికారి అప్పారావు, కన్వీనర్ రమణ, సభ్యులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.